నవతరం
తెలుగు దిన పత్రిక
RNI No: APTEL/2018/76747
జిల్లా అనుబంధం
NAVATARAM | PAGES: 10 | TABLOID 08-09-2026

## ఇది దుశ్శాసన సభ..



**హైదరాబాద్, నవతరం:** ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు అసెంబ్లీకి వెళ్లిన ప్రతిపక్ష సభ్యులపై పోలీసులు అత్యంత కిరాతకంగా వ్యవహరించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ...

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి 1000 రోజులుగా పాలన సాగిస్తోందని, దీనిపై శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తే తమపై ఉక్కుపాదం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో నిరసన తెలిపినట్లే తాము కూడా నిరసన తెలిపేందుకు యత్నించామని, తాము ఎలాంటి అన్‌పార్లమెంటరీ, నికృష్టమైన భాష మాట్లాడలేదని స్పష్టం చేశారు.

## ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు..

**హైదరాబాద్, నవతరం:** తెలంగాణ శాసనసభకు వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని రాష్ట్ర పోలీసులను హైకోర్టు సోమవారం ఆదేశించింది. శాసనసభ్యులు ఏవైనా నిబంధనలు ఉల్లంఘిస్తే ఆ వ్యవహారాన్ని స్పీకర్ చూసుకుంటారని, పోలీసులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని న్యాయస్థానం స్పష్టం చేసింది. అసెంబ్లీ సమీపంలో సోమవారం ఉదయం చోటుచేసుకున్న పరిణామాలను పరిగణనలోకి తీసుకున్న ఉన్నత న్యాయస్థానం, ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉదంతంపై రాష్ట్ర హోం శాఖకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణలో భాగంగా, మహిళా ఎమ్మెల్యేలపై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులను గుర్తించాలని ఆదేశించింది. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదికను సమర్పించాలని డీజీపీని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఉదయం అసెంబ్లీ వద్ద జరిగిన పరిణామాల నేపథ్యంలో హైకోర్టు ఆదేశాలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.



## మదనపల్లె లేడీ డాన్..
# ఎవరీ కోనేటి సులోచన?



**మదనపల్లె, నవతరం:** ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లెలో 'లేడీ డాన్'గా పేరుపొందిన కోనేటి సులోచన నివాసంపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. కోట్ల రూపా యల విలువైన భూదందాలు, బెదిరింపులకు పాల్పడుతోందన్న ఆరోపణలతో పోలీసులు ఆమె ఇల్లు, ఆమె సోదరుడు శ్రీనివాసులు ఇంటిపై ఏకకాలంలో సోదాలు చేపట్టారు. ఈ దాడుల సమయంలో సులోచన ఇంట్లో లేరని, ఆమె విజయవాడలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. డెక్కన్ క్రానికల్ ప్రచురించిన ఒక కథనం ఈ వివరాలను వెల్లడించింది. మదనపల్లె డీఎస్పీ బుచ్చిరాజు నేతృత్వంలో మూడు పోలీసు బృందాలు ఈ సోదాల్లో పాల్గొన్నాయి. మార్పు వెంకటేశ్ నాయుడు అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు, కోర్టు నుంచి పొందిన వారెంట్ ఆధారంగా ఈ దాడులు నిర్వహించారు. సులోచన ఇంటి నుంచి సుమారు 50 కీలక డాక్యుమెంట్లు, ఫోర్జరీ సంతకాలు ఉన్నాయని భావిస్తున్న 15 బాండ్ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం ఇవ్వకుండా ఈ దాడులను ఆకస్మికంగా నిర్వహించినట్లు పోలీసులు వివరించారు. స్వాధీనం చేసుకున్న పత్రాలను ఫోరెన్సిక్ విశ్లేషణ కోసం పంపించారు. ఒకప్పుడు వ్యవసాయ కూలీగా ఒకే గది ఇంట్లో నివసించిన సులోచన, అనతికాలంలోనే కోట్లకు పడగెత్తినట్లు స్థానికులు చెబుతున్నారు. కొందరు రాజకీయ నాయకులు, పోలీసు అధికారుల అండదండలతో ఆమె అక్రమాలకు పాల్పడిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం ముసుగులో భారీ ల్యాండ్ మాఫియా నడుపుతున్నట్లు ఆమెపై ప్రధాన ఆరోపణ. అవసరమైన వారికి అప్పులు ఇచ్చి, ఆ తర్వాత బెదిరింపులు, దౌర్జన్యాలతో వారి భూములను అన్యాయంగా రాయించుకుంటోందని పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు. ఆమె ఇంటి వద్ద బౌన్సర్లను కాపలాగా ఉంచి, బాధితులను భయభ్రాంతులకు గురిచేస్తోందని చెబుతున్నారు. పోలీసు రికార్డుల ప్రకారం, సులోచనపై ఇప్పటికే మదనపల్లె వన్ టౌన్, టూ టౌన్, తాలూకా పోలీస్ స్టేషన్లలో కలిపి 14 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆమెపై రౌడీ షీట్ కూడా తెరిచారు. పోలీసుల దాడుల తర్వాత మరింత మంది బాధితులు ఫిర్యాదు చేసేందుకు ముందుకు వస్తున్నట్లు సమాచారం. బండిమీదకమ్మలపల్లెలో ఒక భవనం, 502 గజాల స్థలం (వీటి విలువ సుమారు రూ.60 కోట్లు), పొన్నుటిపాళ్యంలో 1.75 ఎకరాల భూమి ఆమె పేరు మీద ఉన్నట్లు రికార్డులు చూపిస్తున్నాయి.గతంలో ఆంధ్రప్రదేశ్‌లో 'లేడీ డాన్‌లు'గా పేరుపొందిన నిడిగుంట అరుణ, అరవ కామాక్షి తరహాలోనే సులోచన కూడా నేర సామ్రాజ్యాన్ని విస్తరించిందని స్థానికులు పోల్చుతున్నారు. కాగా, ఫోరెన్సిక్ నివేదిక వచ్చిన తర్వాత ఫోర్జరీ ఆరోపణలపై మరింత స్పష్టత వస్తుందని పోలీసులు భావిస్తున్నారు.

# 'హైడ్రా ప్రజావాణి'కి 53 ఫిర్యాదులు



**హైదరాబాద్, నవతరం:** కాలనీల్లో, నివాస ప్రాంతాల్లో ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కబ్జా చేసి ప్లాట్లుగా మార్చేస్తున్నారని హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దేవాలయాలకు, ప్రభుత్వ పాఠశాలలకు, షాపింగ్ కాంప్లెక్స్‌కు కేటాయించిన స్థలాలను ఆక్రమించి ఇళ్లు నిర్మించేస్తున్నారని పలువురు పేర్కొన్నారు. రహదారులు, పార్కులు కూడా కబ్జాలకు గురౌతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలంలోని బాలాపూర్ పెద్ద చెరువు ఒడ్డున వందల ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ స్థలం కబ్జాకు గురైందని స్థానికులు ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 334/ఏ సమీపంలో ఉన్న ఆలయ భూమిని కూడా వెంచర్‌లో కలిపేసి అమ్మేశారని ఆరోపించారు. హనుమాన్ జయంతి, శ్రీరామనవమి ఉత్సవాల సమయంలో భక్తుల రాకపోకలకు మరింత ఇబ్బంది కలుగుతోందని పేర్కొన్నారు. వనస్థలి హిల్స్ లో నాలా ఆక్రమణ, మాన్సూరాబాద్ పెద్ద చెరువులోకి మురుగు నీటి ప్రవాహం, ఖాజాగూడ, బాగ్ హయత్‌నగర్‌లో ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల పరిరక్షణ.. ఇలా హైడ్రా ప్రజావాణికి మొత్తం 53 ఫిర్యాదులందాయి. వీటిని హైడ్రా అడిషనల్ కమిషనర్ డి. ఆనంద్‌కుమార్ పరిశీలించి పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించారు.

## ఫిర్యాదులు ఇలా..

హయత్‌నగర్ మండలం బాగ్ హయత్‌నగర్‌లోని ఐపీఎం బ్లడ్ బ్యాంక్ కాలనీలో ఆలయం కోసం కేటాయించిన 600 చదరపు గజాల ఖాళీ స్థలం కబ్జాకు గురైందని కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు ఫిర్యాదు చేశారు. రంగారెడ్డి జిల్లా, హాయత్‌నగర్ మండలం, బాగ్ హాయత్‌నగర్‌లోని సర్వే నంబర్లు 233, 234, 235, 236లో ఉన్న తమ కాలనీ లేఅవుట్‌లో ఆలయం కోసం 600 చదరపు గజాల స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. ఆ స్థలాన్ని కొందరు ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఆలయం కోసం కేటాయించిన స్థలాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని హైడ్రా ప్రజావాణిలో కోరారు. సరూర్‌నగర్ రెవెన్యూ మండలం నాదర్‌గుల్ గ్రామ పరిధిలోని టెలికాం అకౌంట్స్ ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లే అవుట్‌లోని ప్లాట్ నంబర్ 327/18 పై భూకబ్జా, లేఅవుట్‌లో అక్రమ మార్పులు, అనధికార పునర్విక్రయం, అనుమతి లేని నిర్మాణాలు జరుగుతున్నాయని కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్లు 77, 78, 81 నుంచి 86, 90లోని 200 చదరపు గజాలు (167.23 చదరపు మీటర్లు) విస్తీర్ణంలో ఉన్న ప్లాట్‌ను ఆక్రమించుకున్నారని ఫిర్యాదుదారు ఆరోపించారు. స్థలాన్ని పరిశీలించి అనుమతి లేని నిర్మాణాలను తొలగించడంతో పాటు ఆస్తికి రక్షణ కల్పించాలని కోరారు. బాలానగర్ తహసీల్దార్ నివేదిక ప్రకారం సర్వే నంబర్ 1, సీ.ఎస్. 14లోని మొత్తం 108 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా ఇందులో 1303 చదరపు గజాల స్థలంలో జీహెచ్ ఎంసీని తప్పుదోవ పట్టించి నిర్మాణ అనుమతులు తీసుకున్నారని.. వెంటనే ఈ అనుమతులను పరిశీలించి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని ఆ పరిసర కాలనీల్లో ఉంటున్న వారు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమికి నిర్మాణ అనుమతి ఎలా మంజూరైందన్న అంశంపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా ఉంటే తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారు కోరారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర మండలం కుందన్‌పల్లి, టీపీఎస్ చాముండిపట్నం ఆమోదిత లేఅవుట్‌లో మార్కెట్ ప్లేస్‌గా కేటాయించిన భూమి అనధికారికంగా ఆక్రమణకు గురవుతోందని ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్లు 13/పి, 14, 16/పి, 17, 18/పి, 32/పి, 33/పి, 34 పరిధిలో మార్కెట్ ప్లేస్ కోసం కేటాయించిన స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తూ ప్రీకాస్ట్ ప్రహరీ గోడలు నిర్మించారని ఆరోపించారు. లేఅవుట్‌లో మార్కెట్ ప్లేస్‌గా కేటాయించిన స్థలాన్ని పరిశీలించి పరిరక్షించాలని కోరారు. ఇందుకు సంబంధించిన లేఅవుట్ కాపీతో పాటు పొరుగు భూములకు సంబంధించిన పత్రాలను కూడా హైడ్రాకు అందజేశారు. మాన్సూరాబాద్ పెద్ద చెరువులోకి మురుగు నీరు ప్రవహించకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానిక సంక్షేమ సంఘం హైడ్రాకు ఫిర్యాదు చేసింది. వనస్థలిపురం నుంచి వచ్చే మురుగు నీరు వర్షపు నీటి కాలువలో కలవడం ద్వారా పెద్ద చెరువులోకి చేరుతోందని పేర్కొంది. దీంతో చెరువు నీరు కలుషితమై, పరిసర ప్రాంతాల ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయంది. అలాగే చెరువు పరిసరాల్లో ఆక్రమణలు, అనధికార డెయిరీ ఫారం నిర్వహణ జరుగుతున్నాయని, వాటిపై చర్యలు తీసుకుని చెరువును పరిరక్షించాలని హైడ్రాను కోరింది.

# నేడు తెలంగాణలో డిగ్రీ, పీజీ కళాశాలల బంద్

**హైదరాబాద్, నవతరం:** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణలోని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు మంగళవారం బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ మేరకు తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల సంఘం (టీపీడీఎంఏ) ఒక ప్రకటన విడుదల చేసింది. బంద్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల కార్యకలాపాలను నిలిపివేయనున్నట్లు యాజమాన్యాలు తెలిపాయి. పట్టణ కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహిస్తామని, ప్రభుత్వం తమ డిమాండ్లపై తక్షణమే స్పందించకపోతే భవిష్యత్తులో నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించాయి. ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సకాలంలో అందకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కళాశాలల యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేశాయి. సిబ్బంది వేతనాలు, భవనాల అద్దెలు, విద్యుత్ బిల్లులు వంటి నిర్వహణ ఖర్చులు కూడా చెల్లించలేని దయనీయ స్థితిలో ఉన్నామని వాపోయాయి. ఫీజు బకాయిలు సుమారు రూ. 10,000 కోట్ల వరకు పేరుకుపోయాయని ఇటీవలి కథనాలు, రాజకీయ నేతల ప్రకటనలు స్పష్టం చేస్తున్నాయి. ఇప్పటికే ఆర్థిక ఒత్తిడిని తట్టుకోలేక రాష్ట్రంలో దాదాపు 310 ప్రైవేట్ కళాశాలలు మూతపడ్డాయని ప్రతిపక్ష నాయకులు పేర్కొన్నారు. ఈ సమస్యపై గతంలో ప్రైవేట్ విద్యాసంస్థలు పలుదఫాలుగా ఆందోళనలు చేపట్టినప్పటికీ, ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పష్టమైన హామీ లభించలేదని యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. తాజా బంద్‌తో తమ నిరసనను మరింత ఉద్ధృతం చేస్తున్నట్లు వెల్లడించాయి.

# పారిశుధ్యం ఎక్కడ.. పడకేసింది ఇక్కడ..?

**ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, సెప్టెంబర్ 6 (నవతరం):** కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ చేపట్టిన 'పోరుబాట'లో భాగంగా ఆదివారం అశ్వారావుపేట మండలం ఆసుపాక గ్రామ పంచాయతీలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. గ్రామంలో నెలకొన్న పారిశుధ్య సమస్యలు, అధ్వానంగా మారిన రహదారులు, నిలిచిపోతున్న మురుగు నీరు, తాగునీరు, వీధి దీపాల సమస్యలను నిరసిస్తూ 'పారిశుధ్యం ఎక్కడ? పడకేసింది ఇక్కడ!' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు పిలుపు మేరకు సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు చేపడుతున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఐదో రోజు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల్లో కనీస మౌలిక వసతులు కూడా సరిగా కల్పించలేకపోతున్నారని విమర్శించారు.

### బురద రోడ్లపై వరినాట్లు.. నీటిలో కాగితపు పడవలు

ఆసుపాకలో రోడ్లు అధ్వానంగా మారి వర్షాలకు బురదమయంగా మారడంతో ప్రజలు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నిరసనకారులు తెలిపారు. దీనికి నిరసనగా బురద రోడ్లపైనే వరినాట్లు నాటి తమ నిరసనను వ్యక్తం చేశారు. అసంపూర్తిగా నిర్మించిన సీసీ రోడ్లపై వర్షపు నీరు, మురుగు నీరు నిలిచిపోతున్నాయని ఆరోపిస్తూ ఆ నీటిలో కాగితపు పడవలు వదిలి వినూత్నంగా నిరసన తెలిపారు.

### చీపుర్లు పట్టిన బీఆర్ఎస్ శ్రేణులు

గ్రామంలోని తాగునీటి బావులు, కుళాయిల పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు స్వయంగా తొలగించారు. మురుగు కాలువలను శుభ్రం చేయడంతో పాటు చీపుర్లు పట్టి వీధులను ఊడ్చారు. గ్రామంలోని ప్రధాన వీధులు, మురికి కూపాలను శుభ్రం చేస్తూ ప్రభుత్వ నిర్లక్ష్యంపై నినాదాలు చేశారు. ప్రజల ప్రాథమిక అవసరాలైన పారిశుధ్యం, తాగునీరు, రహదారులు, వీధి దీపాల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలు పరిష్కరించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కాసాని నాగ శేషా పద్మ-చంద్రమోహన్, కౌన్సిలర్ డా. ఉదయజ్యోతి-భూక్యా ప్రసాద్, మాజీ టౌన్ ప్రెసిడెంట్ సత్యవరపు సంపూర్ణ, జుజ్జురపు శ్రీరామ్ మూర్తి, శెట్టిపల్లి రఘురామ్, ఎస్‌కే రఫీ, మోటూరి మోహన్, కొలూరి నరేష్, జక్కుల సందీప్, జక్కుల రాంబాబు, కూనసోత్ నవీన్, నల్లపు రామారావు, లకావత్ వెంకటేశ్వరరావు, జరపల సోమ్లా, కూనసోత్ రామకృష్ణ, ముత్యాలరావు, పానుగంటి లక్ష్మణరావు, జుజ్జురి సత్యనారాయణ, బొల్లుకొండ చెన్నారావు, సున్నం రామలక్ష్మయ్య, మల్లి, మోడియం నాగభూషణం, కొనకళ్ల శ్రీనివాస్, కోర్స వినోద్, డాబా జగయ్య, ముద్దు మరియమ్మతో పాటు మండల బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ఆసుపాక గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






## నెల్లూరు నుంచి నేరుగా తిరుమలకు వెళ్లిన

# బుల్డోజర్ బాబా..

**నెల్లూరు, నవతరం:** ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సోమవారం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అంతకుముందు నెల్లూరు జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, అక్కడి నుంచి నేరుగా తిరుమల చేరుకున్నారు. తిరుమలకు విచ్చేసిన యోగికి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోకి వెళ్లిన ఆయన, స్వామివారి దర్శనం చేసుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు యోగి ఆదిత్యనాథ్‌కు వేదాశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు ఆయనను శ్రీవారి శేషవస్త్రంతో సత్కరించి, తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. యూపీ ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

### స్వర్ణ భారత్ ట్రస్ట్ ప్రస్థానం ఆదర్శనీయం: యోగి

అంతకుముందు, యోగి ఆదిత్యనాథ్ శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని స్వర్ణ భారత్ ట్రస్ట్ ప్రాంగణంలో జరిగిన ‘స్వర్ణ భారత్-సేవా హారతి’ రజతోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 25 ఏళ్లుగా ట్రస్ట్ చేపట్టిన సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. వెంకయ్య నాయుడు రాజ్యసభ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు అందరినీ ఐక్యంగా ముందుకు నడిపారని, ఉత్తర, దక్షిణ భారతాలకు సాంస్కృతిక వారధిగా నిలిచారని ప్రశంసించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ఇతర ప్రాంతాలకు పరిచయం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. ప్రధాని మోదీ లక్ష్యమైన 'వికసిత్ భారత్' ఆవిష్కరణకు స్వర్ణ భారత్ ట్రస్ట్ సేవలు దోహదపడుతున్నాయని తెలిపారు.

### గ్రామీణాభివృద్ధే మా లక్ష్యం: వెంకయ్య నాయుడు

ఈ కార్యక్రమంలో మాట్లాడిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, గ్రామీణ భారతం పురోగమించినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని, ఆ లక్ష్యంతోనే స్వర్ణ భారత్ ట్రస్ట్‌ను నెలకొల్పినట్లు తెలిపారు. యువత తమ కాళ్లపై తాము నిలబడేలా చేయడమే నిజమైన సాధికారత అని పేర్కొన్నారు. తన కుమార్తె దీపా వెంకట్‌కు ట్రస్ట్ బాధ్యతలు అప్పగించానని, కుమారుడు హర్షవర్ధన్ ఫౌండేషన్ ద్వారా సేవ చేస్తున్నారని వివరించారు. తన పిల్లలను రాజకీయాల వైపు ప్రోత్సహించలేదని, అయితే వారి సేవా కార్యక్రమాలను అందరూ ప్రోత్సహించాలని కోరారు. ఈ వేడుకల్లో ఏపీ మంత్రులు నారాయణ, సత్యకుమార్, ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ట్రస్ట్ ఛైర్మన్ కామినేని శ్రీనివాస్, మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ తదితరులు పాల్గొన్నారు.







# పార్టీ ఆఫీస్‌పై చంద్రబాబు ప్రశంసలు..

**అమరావతి, నవతరం:** తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం విద్యుత్ విషయంలో పూర్తి స్వయం సమృద్ధి సాధించే దిశగా పయనిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. పార్టీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో పాల్గొన్న ఆయన, పార్టీ కార్యాలయంలో చేపట్టిన పర్యావరణ హితమైన ఏర్పాట్లపై సంతోషం వ్యక్తం చేశారు. పార్టీ కార్యాలయం ఆదర్శప్రాయంగా ఉందని, ఇక్కడి వాతావరణం తనకు ఎంతో ఆనందాన్నిచ్చిందని అన్నారు.




ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "టీడీపీ కార్యాలయానికి అవసరమైన కరెంటును మనమే ఉత్పత్తి చేసుకునేందుకు సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేశాం. మనకు 1000 కిలోవాట్ల విద్యుత్ అవసరం ఉండగా, ఇప్పటికే 800 కిలోవాట్లు ఇక్కడే ఉత్పత్తి అవుతోంది. భవిష్యత్తులో ఈ క్యాంపస్‌లోనే ఒక మెగావాట్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకునే సామర్థ్యం ఉంది" అని వివరించారు.

కేవలం విద్యుత్‌కే పరిమితం కాకుండా, భూగర్భ జలాలను సమర్థవంతంగా కూడా వినియోగించుకోవాలని, ఆహార వ్యర్థాలతో కంపోస్ట్ ఎరువు తయారు చేసి ప్రాంగణంలోని చెట్లకు వినియోగించాలని సూచించారు.

పార్టీ కేంద్ర కార్యాలయం, పరిసరాలు ఆహ్లాదకరంగా ఉండటంపై సంతృప్తి వ్యక్తం చేసిన చంద్రబాబు, "ఇలాంటి వాతావరణం అంటే అందరికీ ఇష్టమే. ఈ సందర్భంగా మన వర్కింగ్ ప్రెసిడెంట్‌ను (నారా లోకేశ్ ను) అభినందిస్తున్నాను" అని అన్నారు. ప్రస్తుతం పార్టీలో మంచి వాతావరణంలో శిక్షణా తరగతులు జరుగుతున్నాయని, ఈ స్ఫూర్తిని కొనసాగించాలని ఆయన ఆకాంక్షించారు.

# 'టీచర్'పై దాడిని తీవ్రంగా ఖండించిన విద్యాశాఖ

**చిత్తూరు, నవతరం:** జిల్లా కుప్పంలో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. గురుపూజోత్సవం రోజే, తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఒక ఉపాధ్యాయుడిపై ఇద్దరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. బాధితుడు దేశానికి సేవ చేసిన ఒక మాజీ సైనిక హవల్దార్ కావడం గమనార్హం. ఈ ఘటనను పాఠశాల విద్యాశాఖ సుమోటోగా స్వీకరించి, నిందితులపై కఠినమైన క్రిమినల్ చర్యలకు ఆదేశించింది. ఇది స్పోర్ట్స్ కోటాలో నియమితులైన ఉపాధ్యాయులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న ఒక వ్యవస్థీకృత బెదిరింపుల దందా అని అనుమానిస్తున్నామని అధికారులు తెలిపారు.




**విద్యార్థుల ముందే దాడి**

వివరాల్లోకి వెళితే, సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం రోజున కుప్పంలోని ఒక మోడల్ ప్రైమరీ స్కూల్‌లో ఈ ఘటన జరిగింది. మాజీ సైనికుడైన ఉపాధ్యాయుడు తరగతి గదిలో పాఠాలు చెబుతుండగా, ఇద్దరు వ్యక్తులు లోపలికి ప్రవేశించారు. తాము మీడియా ప్రతినిధులమని చెబుతూ, ఉపాధ్యాయుడి మిలిటరీ గుర్తింపు కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు చూపించాలంటూ దురుసుగా ప్రవర్తించారు. విద్యార్థుల ముందే అవమానకరంగా మాట్లాడారు. తన వ్యక్తిగత పత్రాలు అడిగే అధికారం మీకెక్కడిదని ఉపాధ్యాయుడు ప్రశ్నించడంతో, వారు రెచ్చిపోయి ఆయన కాలర్ పట్టుకుని గోడవకు పాల్పడ్డారు. విచారణలో ఈ దాడి పథకం ప్రకారమే జరిగిందని తేలింది. ఘటనకు రెండు రోజుల ముందు, అంటే సెప్టెంబర్ 3న, నిందితులు ఉపాధ్యాయుడికి ఫోన్ చేసి 20 నిమిషాల పాటు మాట్లాడారు. సర్టిఫికెట్లు ఇవ్వకపోతే ఆయనపై తప్పుడు వార్తలు ప్రచురిస్తామని బెదిరించారు. ఈ ఘటనతో ఉపాధ్యాయుడు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

**నిందితుల అరెస్ట్, బెదిరింపుల దందా వెలుగులోకి**

ఈ అమానుష ఘటనపై పాఠశాల విద్యాశాఖ వెంటనే స్పందించి, స్థానిక పోలీసుల సమన్వయంతో క్రిమినల్ కేసు నమోదు చేయించింది. పోలీసులు వేగంగా దర్యాప్తు చేసి, మీడియా ప్రతినిధులమని చెప్పుకుంటున్న శ్రీకాంత్ (సాక్షి రిపోర్టర్), గణేశ్ (సాక్షి కెమెరామెన్) అనే ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. "ఇది చాలా బాధాకరమైన సంఘటన. దేశానికి సేవ చేసి, ఇప్పుడు ఉపాధ్యాయుడిగా గౌరవప్రదమైన వృత్తిని స్వీకరించిన ఒక మాజీ సైనికుడి పట్ల ఇలా ప్రవర్తించడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు" అని తమీమ్ అన్సారియా అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా స్పోర్ట్స్ కోటా కింద ఎంపికైన 372 మంది ఉపాధ్యాయులను లక్ష్యంగా చేసుకుని కొందరు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆమె తెలిపారు. మీడియా ప్రతినిధులుగా నటిస్తూ, సర్టిఫికెట్లు డిమాండ్ చేస్తూ వేధిస్తున్నారని ఆమె వివరించారు.

**ఉపాధ్యాయులకు పూర్తి రక్షణ**

పాఠశాల ప్రాంగణాల్లోకి అనధికారికంగా ప్రవేశించి ఉపాధ్యాయులను బెదిరించినా, వేధించినా కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ తీవ్రంగా హెచ్చరించింది. ఉపాధ్యాయులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చింది. ఇలాంటి బెదిరింపు కాల్స్ లేదా వేధింపులు ఎదురైతే, వెంటనే తమ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయాలని రాష్ట్రంలోని ఉపాధ్యాయులందరికీ సూచించింది. బాధితులకు పూర్తి పరిపాలన, చట్టపరమైన మద్దతు అందిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. నిరాధార ఆరోపణలు మాని, ఆధారాలతో కూడిన ఫిర్యాదులు ఉంటే విద్యాభవన్‌లోని గ్రీవెన్స్ సెల్‌కు అందజేయాలని ప్రభుత్వం ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

# ‘ఎస్ఐఆర్’ గడువు మరోసారి పొడిగింపు

**హైదరాబాద్, నవతరం:** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమం గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. జాబితాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లు దాఖలు చేసేందుకు అక్టోబర్ 7వ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఈ మేరకు సవరించిన షెడ్యూల్‌ను ఈసీ విడుదల చేసింది. గతంలో పొడిగించిన షెడ్యూల్ ప్రకారం ఈ గడువు సెప్టెంబర్ 16తో ముగియాల్సి ఉంది. అయితే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు మరింత సమయం కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి కేంద్ర ఎన్నికల సంఘానికి




వేర్వేరుగా లేఖలు రాశారు. వారి విజ్ఞప్తిని సానుకూలంగా పరిగణనలోకి తీసుకున్న ఎన్నికల సంఘం, గడువును మరోసారి పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. కొత్త షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలను స్వీకరించి, వాటిని పరిష్కరించిన అనంతరం నవంబర్ 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఈసీ నిర్ణయంతో కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే వారికి, అలాగే జాబితాలో తప్పులను సరిదిద్దుకోవాలనుకునే వారికి అదనపు సమయం లభించినట్లయింది.

# ట్రాన్స్‌జెండర్ల ఆగడాలపై డీజీపీ సీరియస్..

**హైదరాబాద్, నవతరం:** కొందరు ట్రాన్స్‌జెండర్లు శుభకార్యాల వద్ద బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్న ఘటనలపై తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తీవ్రంగా స్పందించారు. ఇలాంటి బెదిరింపులు, దోపిడీలను అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా మరోసారి ప్రత్యేక డ్రైవ్ (స్పెషల్ డ్రైవ్) చేపట్టాలని అన్ని కమిషనరేట్ల సీపీలను ఆదేశించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇటీవల హైదరాబాద్‌లోని చింతల్‌లో ఓ గృహప్రవేశ వేడుకలో ట్రాన్స్‌జెండర్లు రూ. 50,000 డిమాండ్ చేసిన ఘటన సోషల్ మీడియాలో వైరల్ అయిన నేపథ్యంలో డీజీపీ ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. సెప్టెంబర్ 4న చింతల్ ప్రాంతంలో ఓ కుటుంబం తమ నూతన గృహంలోకి ప్రవేశించేందుకు రాగా, కొందరు ట్రాన్స్‌జెండర్లు వారిని అడ్డుకున్నారు. ఇంట్లోకి వెళ్లాలంటే రూ. 50,000 ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. అంత మొత్తం ఇచ్చుకోలేమని బాధితులు చెప్పినా వినకుండా అసభ్యంగా ప్రవర్తించి, శాపనార్థాలు పెట్టారని బాధితురాలు వీడియో ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వ్యాపించడంతో, ఇలాంటి వసూళ్ల దందాలపై కఠిన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు పోలీసులను కోరారు. ఈ ఘటనపై స్పందించిన డీజీపీ సీవీ ఆనంద్, ఇటీవల కాలంలో ఇలాంటి ఫిర్యాదులు తన దృష్టికి వస్తున్నాయని అంగీకరించారు. తాను హైదరాబాద్ సీపీగా ఉన్నప్పుడు కూడా ఇలాంటి బెగ్గింగ్ రాకెట్లు, బలవంతపు వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి నియంత్రించినట్లు గుర్తుచేశారు. ఇప్పుడు మళ్లీ అదే తరహా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.





అదే సమయంలో, ట్రాన్స్‌జెండర్ల జీవనోపాధికి తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని డీజీపీ ప్రస్తావించారు. ప్రభుత్వ చొరవతో ఎందరో ట్రాన్స్‌జెండర్లు ట్రాఫిక్ అసిస్టెంట్లుగా, ఇతర విభాగాల్లో ఉద్యోగాలు పొంది ఎలాంటి ఫిర్యాదులు లేకుండా మంచి పేరు తెచ్చుకుంటున్నారని ఆయన వివరించారు.

## పలు కేసులు ఛేదించిన

# జగద్గిరిగుట్ట పోలీసులు

**సైబరాబాద్, నవతరం:** జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన వివిధ నేరాలకు సంబంధించి పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి, కేవలం రెండు రోజుల్లో ఐదు కేసులను ఛేదించారు. కేసులకు సంబంధించి నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు చోరీకి గురైన సొత్తు, మోసం ద్వారా తీసుకున్న నగదు మరియు బంగారాన్ని రికవరీ చేశారు.

### మోసం కేసులో నిందితుడి అరెస్ట్

రూ.9 లక్షల నగదు, 3.5 తులాల బంగారం మోసం... మోసం మరియు ఐటీ యాక్ట్‌కు సంబంధించిన కేసులో ఫిర్యాదు అందడంతో జగద్గిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో నిందితుడు కామినెడ్డి శివమోహన్ రెడ్డి, అక్కపల్లి గ్రామం, మార్కాపురం ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. దర్యాప్తులో నిందితుడు గతంలో సుమారు 12 సంవత్సరాల పాటు SSB (Sashastra Seema Bal) లో కానిస్టేబుల్‌గా పనిచేసినట్లు, అనంతరం విధి నిర్వహణలో అనుచిత ప్రవర్తనతో పాటు ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడటంతో సర్వీసు నుండి తొలగించబడినట్లు గుర్తించారు. సర్వీసు నుండి తొలగించబడిన అనంతరం ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి, వివిధ వ్యక్తులతో పరిచయాలు ఏర్పరచుకుని వారి నమ్మకాన్ని సంపాదించి డబ్బులు తీసుకుని మోసం చేస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. గతంలో కూడా ఇలాంటి మోసం కేసుల్లో జైలుకు వెళ్లినట్లు గుర్తించారు. ప్రస్తుత కేసులో బాధితురాలితో ఫోన్ ద్వారా పరిచయం ఏర్పరచుకుని, కొంతకాలం పాటు సన్నిహితంగా ఉంటూ ఆమె నమ్మకాన్ని సంపాదించాడు. అనంతరం తనకు, తన కుటుంబ సభ్యులకు వివిధ అవసరాలు ఉన్నాయని, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తదితర కారణాలు చెబుతూ బాధితురాలిని నమ్మించి, వివిధ సందర్భాల్లో సుమారు రూ.9,00,000/- నగదు తీసుకుని మోసం చేసినట్లు దర్యాప్తులో తేలింది. అదేవిధంగా సుమారు 3.5 తులాల బంగారం కూడా తీసుకుని, దానిని కంభం కెనరా బ్యాంకులో తాకట్టు పెట్టినట్లు గుర్తించారు. నిందితుడిపై గతంలో కూడా మార్కాపురం, గిద్దలూరు ప్రాంతంలోని పోలీస్ స్టేషన్లలో ఇలాంటి మోసాలకు సంబంధించి కేసులు నమోదైనట్లు గుర్తించారు. నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపరచగా, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు పోలీసులు.

### అస్బెస్టాస్ కాలనీలో వరుస ఇళ్ల దొంగతనాలు – నిందితుడి అరెస్ట్, చోరీ సొత్తు రికవరీ

జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని అస్బెస్టాస్ కాలనీలో గత 15 రోజులుగా రాత్రి వేళల్లో వరుస ఇళ్ల దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో అందిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో నిందితుడు గరికపాటి వెంకటేష్గా గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితుడు మొత్తం మూడు ఇళ్లలో దొంగతనాలకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఒక ఇంట్లో మొబైల్ ఫోన్, మరో ఇంట్లో వెండి వస్తువులు, మరో ఇంట్లో 3 గ్రాముల బంగారం మరియు రూ.60,000/- నగదు చోరీ చేసినట్లు గుర్తించారు. నిందితుడి వద్ద నుండి మొబైల్ ఫోన్ మరియు 3 గ్రాముల బంగారం విజయవంతంగా రికవరీ చేశారు. నిందితుడిని గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించడం జరిగింది.

### రూ.10 లక్షల విలువైన నాలుగు బ్యాటరీల చోరీ కేసులో నిందితుడి అరెస్ట్ – బ్యాటరీలు రికవరీ

జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని EV ఛార్జింగ్ స్టేషన్‌లో పనిచేస్తున్న తోట గురువప్ప ఆగస్టు 15వ తేదీన నాలుగు బ్యాటరీలను చోరీ చేసినట్లు ఫిర్యాదు అందింది. ఛార్జింగ్ స్టేషన్ సూపర్‌వైజర్ మహేష్ యాదవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో నిందితుడు చోరీ చేసిన బ్యాటరీలను స్క్రాప్ షాపులో విక్రయించి, వచ్చిన డబ్బుతో తన స్వస్థలమైన గిద్దలూరుకు వెళ్లిపోయినట్లు గుర్తించారు. ఒక్కో బ్యాటరీ విలువ సుమారు రూ.2.50 లక్షలు కాగా, నాలుగు బ్యాటరీల మొత్తం విలువ సుమారు రూ.10 లక్షలు. నిందితుడి ఆచూకీని గుర్తించిన పోలీసులు ప్రత్యేక బృందాన్ని గిద్దలూరుకు పంపించి, నిందితుడిని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుండి చోరీకి గురైన నాలుగు బ్యాటరీలను విజయవంతంగా రికవరీ చేశారు. నిందితుడిని గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

### పోలీసుల ప్రత్యేక దృష్టి

నేరాల నియంత్రణ, కేసుల త్వరితగతిన ఛేదనకు జగద్గిరిగుట్ట పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంతో పాటు, సమన్వయంతో దర్యాప్తు చేపట్టి కేవలం రెండు రోజుల్లో ఐదు కేసులను ఛేదించి, నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు చోరీకి గురైన విలువైన సొత్తును రికవరీ చేశారు. ఈ కేసులను డీసీపీ కుత్బుల్లాపూర్ కోటి రెడ్డి, ఆదేశాల మేరకు, ఏసీపీ కుత్బుల్లాపూర్ బాలగంగి రెడ్డి ఆధ్వర్యంలో విజయవంతంగా ఛేదించారు. కేసుల ఛేదనలో ఇన్‌స్పెక్టర్ సురేష్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ నరేంద్ర రెడ్డి, ఏఎస్సై రామ్ కుమార్, పీసీలు నరేష్ గౌడ్, రమేష్ మరియు డబ్ల్యూపీసీ సుమ విశేష కృషి చేశారు. వారి సమర్థవంతమైన దర్యాప్తు, కృషి మరియు విధి నిర్వహణలో చూపిన ప్రతిభను ఉన్నతాధికారులు అభినందించి, తగిన రివార్డుతో సత్కరించారు.



# పొన్న నాగేశ్వరరావు కు జీవితఖైదు

**సైబరాబాద్, నవతరం:** హత్య కేసులో నిందితుడు పొన్న నాగేశ్వరరావు రంగారెడ్డి జిల్లా న్యాయస్థానం దోషిగా నిర్ధారించి, జీవిత ఖైదుతో పాటు రూపాయలు 20,000 జరిమానా విధించింది. వివరాల్లోకి వెళితే.. నిందితుడు పొన్న నాగేశ్వరరావు 2004 సంవత్సరంలో మృతురాలు పి. కల్పనను వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ మరియు ఆర్థిక సమస్యల కారణంగా భార్యాభర్తల మధ్య తరచుగా గొడవలు జరిగేవి. నిందితుడు తనను వేధిస్తున్నాడని ఆరోపిస్తూ మృతురాలు గతంలో కూడా ఫిర్యాదులు చేసింది. 2017 సంవత్సరంలోని దసరా పండుగ సమయంలో కుటుంబ సభ్యుల సమక్షంలో జరిగిన వివాదాలతో భార్యాభర్తల మధ్య ఉద్రిక్తత మరింత పెరిగింది. 05.10.2017న సిగరెట్ విషయమై నిందితుడు మరియు మృతురాలి మధ్య గొడవ జరిగింది.



ఈ సందర్భంగా నిందితుడు మృతురాలిపై దాడి చేసి, అనంతరం విధులకు వెళ్లిపోయాడు. తరువాత నిందితుడు తిరిగి ఇంటికి వచ్చి, మరోసారి మృతురాలితో గొడవకు దిగాడు. ఈ సందర్భంగా నిందితుడు మృతురాలి గొంతును బలవంతంగా చేతులతో నొక్కి పట్టుకోవడంతో, చేతులతో గొంతు నులిమి హత్య చేసి, సంఘటన స్థలం నుండి పరారయ్యాడు.

దర్యాప్తు సమయంలో పోలీసులు సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేయడంతో పాటు వైద్య ఆధారాలను సేకరించారు. సదరు ఆధారాలు మృతురాలి మరణం హత్యాత్మక మరణం అని నిర్ధారించాయి. దర్యాప్తు ద్వారా నిందితుడు ఉద్దేశపూర్వకంగా మృతురాలి మరణానికి కారణమైనట్లు నిర్ధారణ అయింది. నిందితుడిని 07.10.2017న అరెస్టు చేసి, దర్యాప్తు పూర్తయిన అనంతరం న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేశారు పోలీసులు. కేసుపై పూర్తి స్థాయి విచారణ అనంతరం, Hon'ble Xth Additional District and Sessions Court, RR District at Rajendranagar నిందితుడిని దోషిగా నిర్ధారించి, జీవిత ఖైదుతో పాటు ₹20,000/- జరిమానా విధించింది. ఈ కేసులో దర్యాప్తు అధికారి జి.వి. రమణ గౌడ్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్, నార్సింగి డివిజన్, మరియు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి. కృష్ణమూర్తి విచారణ సమయంలో సమర్థవంతమైన కృషి చేసి, నిందితుడికి శిక్ష పడేలా కృషి చేశారన్నారు సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ ఏ. ముత్యం రెడ్డి.

# నల్ల దుస్తులతో అసెంబ్లీకి రావడం నేరమా?

**పటాన్‌చెరు, నవతరం:** అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పటాన్‌చెరు పట్టణంలోని జాతీయ రహదారిపై నిరసన ధర్నా నిర్వహించారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పిలుపు మేరకు నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో సీనియర్ నాయకులు గూడెం మధు తో కలిసి బీఆర్ఎస్ నాయకులు మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత సిగ్గుచేటని తీవ్రంగా విమర్శించారు. ప్రజాస్వామ్య దేశంలో రాజ్యాంగబద్ధంగా నల్ల దుస్తులు ధరించి అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావడం నేరమా? అని ప్రశ్నించారు. ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల హక్కులను అడ్డుకునే విధంగా ప్రభుత్వం, పోలీసులు వ్యవహరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన అన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, ఆ హక్కును కాలరాసే ప్రయత్నాలను బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని మాద్రి పృథ్వీరాజ్ అన్నారు. ప్రజల హక్కులు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పృథ్వీరాజ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, పార్టీ శ్రేణులు, అభిమానులు, ఎంపీఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.






# నిబంధనలు పాటిస్తూ వ్యాపారాలు నిర్వహించాలి

## సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్

**సైబరాబాద్, నవతరం:** పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హోటల్స్, బార్ అండ్ రెస్టారెంట్లు, పబ్స్, హుక్కా సెంటర్ల యజమానులతో సోమవారం సైబరాబాద్ సీపీ కార్యాలయ ఆడిటోరియంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, వ్యాపార సంస్థల యజమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్ మాట్లాడుతూ, వ్యాపార సంస్థలు చట్టబద్ధంగా, ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ తమ కార్యకలాపాలను నిర్వహించాలని సూచించారు. ప్రతి వ్యాపార సంస్థకు అవసరమైన అన్ని అనుమతులు, లైసెన్సులు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఫైర్ డిపార్ట్‌మెంట్ ఎన్‌ఓసీ, సీఏంసీ ఎన్‌ఓసీ, చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ ఎన్‌ఓసీ, టౌన్ ప్లానింగ్ ఎన్‌ఓసీ తదితర అవసరమైన అనుమతులను పొందాలని సూచించారు. CPPMS పోర్టల్ ద్వారా జారీ చేసిన లైసెన్సుల గడువు ముగిసిన వెంటనే వాటిని సకాలంలో రెన్యువల్ చేసుకోవాలని తెలిపారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో లైసెన్సులు పొందిన సంస్థల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ, పెద్ద సంఖ్యలో హోటల్స్, రెస్టారెంట్లు, పబ్స్ తదితర వ్యాపార సంస్థలు నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని సీపీ తెలిపారు. కొన్ని సంస్థలు సరైన లైసెన్సులు లేకుండానే కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. చెల్లుబాటు అయ్యే లైసెన్సులు, అనుమతులు లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో వ్యాపార యజమానులు తమ సమస్యలను సీపీ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా వివిధ శాఖలకు సంబంధించిన లైసెన్సులు, అనుమతుల సమయాలు వేర్వేరుగా ఉండటం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. దీనిపై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని, నిబంధనలకు లోబడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీపీ అధికారులను సూచించారు. పబ్స్, బార్లు తదితర సంస్థల్లో అనుమతించిన సమయం ముగిసిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ కార్యకలాపాలు కొనసాగించరాదని సీపీ స్పష్టం చేశారు. నిర్ణీత సమయాలను ఖచ్చితంగా పాటించాలని, సమయం ముగిసిన తర్వాత మద్యం విక్రయాలు లేదా ఇతర కార్యకలాపాలు నిర్వహించడం వంటి నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడరాదని హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లో బార్ అండ్ రెస్టారెంట్లు లోకి మైనర్లు ను అనుమతించవద్దని సూచించారు. వ్యాపార








సంస్థల్లో పనిచేస్తున్న సిబ్బందికి సరైన ఆధార్ ధృవీకరణ, గుర్తింపు పత్రాలు, వయస్సు నిర్ధారణకు సంబంధించిన వివరాలు తప్పనిసరిగా ఉండేలా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. మైనర్లను నిబంధనలకు విరుద్ధంగా పనిలోకి తీసుకోవద్దని స్పష్టం చేశారు. హోటల్స్, పబ్స్, రెస్టారెంట్లలో వినియోగదారుల ప్రవర్తనపై కూడా యాజమాన్యాలు ప్రత్యేక దృష్టి పెట్టాలని సీపీ సూచించారు. ఎవరైనా రాజకీయ నాయకుల కుటుంబ సభ్యులు లేదా ఇతర ప్రముఖుల బంధువులమని చెప్పుకుని సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించినా, నిబంధనలు ఉల్లంఘించినా వారికి ఎలాంటి ప్రత్యేక మినహాయింపులు ఉండవని స్పష్టం చేశారు. చట్టం అందరికీ సమానమేనని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. బార్లు, పబ్‌లలో గ్యాంగ్‌ల మధ్య గొడవలు, ఘర్షణలు జరిగే పరిస్థితులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వకూడదని సీపీ సూచించారు. ఇటువంటి ఘటనలు ప్రజలకు ఇబ్బందులు కలిగించడంతో పాటు శాంతిభద్రతల సమస్యలకు దారితీస్తాయని తెలిపారు. మాదకద్రవ్యాలు, ఇతర నిషేధిత పదార్థాల వినియోగం, విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు వ్యాపార సంస్థల యాజమాన్యాలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. తెలంగాణలో హుక్కా కార్యకలాపాలు నిషేధించబడిన నేపథ్యంలో, ఎట్టి పరిస్థితుల్లోనూ హుక్కా సెంటర్లను నిర్వహించరాదని సీపీ స్పష్టం చేశారు. COTPA చట్టంలోని నిబంధనలను ఉల్లంఘిస్తూ హుక్కా కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం ఉల్లంఘనలకు పాల్పడితే గరిష్టంగా 7 సంవత్సరాల వరకు జైలు శిక్షతో పాటు రూ.2 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని తెలిపారు.

సైబరాబాద్ పోలీసుల లక్ష్యం వ్యాపారాలను అడ్డుకోవడం కాదని, చట్టబద్ధంగా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వ్యాపారాలు నిర్వహించే వారికి సైబరాబాద్ పోలీసులు పూర్తి సహకారం అందిస్తారని సీపీ తెలిపారు. అయితే చట్టాలు, నిబంధనలు ఉల్లంఘిస్తూ వ్యాపారాలు నిర్వహించే సంస్థలపై మాత్రం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. హోటల్స్, రెస్టారెంట్లు, పబ్స్ తదితర సంస్థల యజమానులు పోలీసులకు సహకరిస్తూ నిర్ణీత సమయాలు, లైసెన్సింగ్ నిబంధనలు, సిబ్బంది వయస్సు ధృవీకరణ, మాదకద్రవ్యాల నియంత్రణ, ప్రజా భద్రతకు సంబంధించిన అన్ని నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్, ఐపీఎస్ సూచించారు. ఈ సమావేశంలో అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, ఐపీఎస్, కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, ఐపీఎస్, కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి, ఐపీఎస్, శేరిలింగంపల్లి డీసీపీ సీ.హెచ్. శ్రీనివాస్, ఐపీఎస్, ఎస్‌ఓటీ డీసీపీ శోభన్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## తాతా మధును బర్తరఫ్ చేయాలి, కేసీఆర్ క్షమాపణ చెప్పాలి

# ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**హైదరాబాద్, నవతరం:** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్టుగా భావిస్తున్న వ్యాఖ్యలు శాసనసభ వేదికగా తీవ్ర దుమారాన్ని రాజేశాయి. సభలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... రాజ్యాంగబద్ధమైన స్థానంలో ఉన్న స్పీకర్‌పై తాతా మధు వాడిన భాషను తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ ఎమ్మెల్యేల తరఫున స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ తక్షణమే దీనిపై సభకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తాతా మధు కావాలని మాట్లాడారా లేక ఎవరైనా మాట్లాడించారా అని ప్రశ్నించిన ఏలేటి... ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించిన సదరు ఎమ్మెల్సీని పదవి నుంచి తక్షణమే బర్తరఫ్ చేయాలని పట్టుబట్టారు. ఇదే క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా సభలో తీవ్రస్థాయిలో మండిపడుతూ, కేసీఆర్ క్షమాపణలు చెప్పాల్సిందేనని, మధుపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దళిత వర్గానికి చెందిన స్పీకర్‌కు జరిగిన తీవ్ర పరాభవంపై మంత్రి సీతక్క అసెంబ్లీలోనే భావోద్వేగానికి గురై కంటతడి పెట్టగా... స్పీకర్ గడ్డం ప్రసాద్ కూడా తీవ్ర మనస్తాపంతో భావోద్వేగానికి లోనై కన్నీళ్లు పెట్టుకోవడం సభను కుదిపివేసింది. మరోవైపు 22-ఏ నిషిద్ధ భూముల వివాదంపై ప్రభుత్వాన్ని మహేశ్వర్ రెడ్డి నిలదీశారు. 22-ఏ భూముల్లో జరిగిన అక్రమాలపై స్వయంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డే క్షమాపణలు చెప్పాలని, అధికారుల మీద నెపం నెట్టి తప్పించుకోవాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ భూకుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తామని మంత్రి శ్రీధర్ బాబు సభలోనే స్పష్టమైన హామీ ఇస్తే తమ నిరసనను విరమిస్తామని స్పష్టం చేశారు. దీనిపై ప్రభుత్వం నేరుగా సమాధానం చెప్పకుండా ఇతర అంశాలతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని మండిపడ్డారు. 'ధరణి'పై నిజంగానే ఫోరెన్సిక్ ఆడిట్ జరిగిందా అని నిలదీసిన ఆయన... ఒకవేళ జరిగితే ఆ ఆడిట్ నివేదికలను పబ్లిక్ డొమైన్‌లో పెట్టి ప్రజల ముందుకు తీసుకురావాలని డిమాండ్ చేశారు.

# ప్రముఖ యూట్యూబర్ నందన అరెస్ట్

- శంషాబాద్ విమానాశ్రయంలో యూట్యూబర్ నందన అరెస్ట్
- లుకౌట్ నోటీసులు ఉండటంతో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- లండన్‌లో ఉద్యోగాల పేరిట డబ్బు వసూలు చేశారన్న ఆరోపణలు
- ఇబ్రహీంపట్నం పోలీసులకు నందనను అప్పగించిన అధికారులు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**హైదరాబాద్, నవతరం:** ప్రముఖ యూట్యూబర్ నందనను శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెపై ఇప్పటికే లుకౌట్ నోటీసులు పెండింగ్‌లో ఉండటంతో విమానాశ్రయంలో ఆమెను గుర్తించి అరెస్ట్ చేశారు. అనంతరం ఆమెను ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. నందన, ఆమె భర్త కలిసి లండన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఈ మోసంపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో భాగంగానే ఆమెపై లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి.

ఈ క్రమంలో సోమవారం శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చిన నందనను ఇమ్మిగ్రేషన్ అధికారులు గుర్తించి, ఎయిర్‌పోర్ట్ పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఆమెను అదుపులోకి తీసుకుని, కేసు విచారణ చేస్తున్న ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు దర్యాప్తును కొనసాగిస్తున్నారు

